



RNI No. APTEL/26/A1414

# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY







SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 1 | సంచిక : 9 | గుంటూరు జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | సోమవారం 20 ఏప్రియల్ 2026 | పేజీలు : 4 | వెల : 2/-


## పారదర్శకంగా ఉంటున్నాం..

# ప్రజలకు నిజాలు చెబుదాం



### ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఒక్కో సమస్యనూ పరిష్కరిస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. సంక్షేమం- అభివృద్ధి అందించడంలో రాజీ లేకుండా పరిపాలన సాగిస్తున్నామన్నారు. ప్రభుత్వంపై, కూటమి పార్టీలపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. 'పారదర్శకంగా ఉంటున్నాం.. ప్రజలకు నిజాలు చెబుదామని' పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ ముఖ్యనేతలతో సీఎం చంద్రబాబు శనివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ ఇచ్చే శిక్షణా తరగతులతో లీడర్-కేడర్ మధ్య ఎమోషనల్ కనెక్టివిటీ మిగతా .. 2లో..

అన్న క్యాంటీన్‌కు రూ.76లక్షల

## విరాళం ఇచ్చిన భువనేశ్వరి


జన్మదినం సందర్భంగా పటమట అన్న క్యాంటీన్‌కు వెళ్లనున్న సీఎం చంద్రబాబు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం ఉదయం 9.30 గంటలకు విజయవాడ నగరంలోని పటమట అన్న క్యాంటీన్‌కు వెళ్లి అల్పాహారం తీసుకోనున్నారు. ఏప్రిల్ 20న ముఖ్యమంత్రి మిగతా .. 2లో..

## చంద్రబాబు బర్త్‌డే..

క్యాంపెయిన్ డీపీ విడుదల చేసిన లోకేశ్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టిన రోజు (ఏప్రిల్ 20) సందర్భంగా మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక క్యాంపెయిన్ డీపీ విడుదల చేశారు. చంద్రబాబు నాయకత్వం, అభివృద్ధి కార్యక్రమాలు వివరించేలా డిస్‌ప్లే పిక్చర్ రూపొందించారు.

## కడప రిమ్స్ వద్ద హత్య...

11 మంది అరెస్టు



**కడప, విశ్వం వాయిస్ న్యూస్ :** వైకాపా కార్యకర్త పెద్దదస్తగిరి హత్య కేసులో 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 5వ తేదీ రాత్రి కడప రిమ్స్ ఆస్పత్రి ఆవరణలో పెద్ద దస్తగిరి హత్యకు గురయ్యాడు. ఈ నేపథ్యంలో ప్రధాన నిందితులు రాజా, రవి సహా 11 మందిని పోలీసులు అరెస్టు చేశారు. కడప శివారులోని ఆలంఖాన్‌పల్లెకు చెందిన పెద్దదస్తగిరి (53) స్థిరాస్తి వ్యాపారం చేస్తుండేవాడు. ఈ నెల 4వ తేదీ మిగతా .. 2లో..

'ఉల్లి తింటా..

## బుర్ర మాత్రం తినను'..

### దుకాణదారుడితో మోదీ సరదా సంబాషణ



**కోల్‌కతా, విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమబెంగాల్ ఎన్నికల వేళ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రంలో నాలుగు ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ.. ఝార్‌గ్రామ్‌లో సాయంత్రం వేళ కాసేపు విరామం తీసుకున్నారు. రోడ్డు పక్కన ఉన్న ఒక దుకాణం వద్ద ఆగి 'ఝాల్ మురీ' (మరమరాలతో చేసే స్నాక్) ఆరగించారు. ఝార్‌గ్రామ్‌లో భారీ బహిరంగ సభనుద్దేశించి ప్రసంగించిన తర్వాత హెలిప్యాడ్‌కు వెళ్లే దారిలో ఆగి ఈ బెంగాలీ స్ట్రీట్ ఫుడ్‌ను ఆస్వాదించారు. ఝాల్‌మురీకి స్వయంగా డబ్బులు చెల్లించారు. దుకాణదారుడు 'మీరు ఉల్లిపాయలు తింటారా?' అని అడగ్గా.. 'హా తింటాను, మిగతా .. 2లో..

## బాణసంచా పరిశ్రమలో పేలుడు..

17 మంది మృతి



**విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడులో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. విరుద్‌నగర్ జిల్లా కట్టనార్‌పట్టి గ్రామంలో ఉన్న ఓ బాణసంచా పరిశ్రమలో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 17 మంది మృతి చెందగా పలువురు గాయపడినట్లు తెలిసింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పేలుడు మిగతా .. 2లో..

రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి

## ప్రభుత్వం కట్టుబడి ఉంది

### మంత్రి, గృహ నిర్మాణ సంస్థ, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్ధ సారధి




**చీరాల, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని బాపట్ల జిల్లా ఇంచార్జి మంత్రి, గృహ నిర్మాణ సంస్థ మరియు సమాచార శాఖా మంత్రి కొలుసు పార్ధ సారధి అన్నారు. ఆదివారం, చీరాల మండలం, అక్కయిపాలెం గ్రామపంచాయతీ, రామాపురం, పాండురంగా బీచ్ నందు జిల్లా కలెక్టర్, చీరాల ఎమ్మెల్యే, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఉమామహేశ్వరరావు,బాపట్ల పార్లమెంట్ పార్టీ ప్రెసిడెంట్ శలగల రాజశేఖర్ తో కలసి బాపట్ల జిల్లా ఇంచార్జి మంత్రి, గృహ నిర్మాణ సంస్థ మరియు సమాచార శాఖా మంత్రి కొలుసు పార్ధ సారధి డైవ్ చీరాల భాగంగా ఏర్పాటు చేసిన జెట్ స్కీ రైడర్స్, విహంగ్ అడ్వెంచర్స్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను అభివృద్ధి చేసే మిగతా .. 2లో..

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా

## కూటమి ప్రభుత్వం పని చేస్తోంది

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడిగా మూడో సారి తనకు అవకాశమిచ్చి నందుకు సీఎం చంద్రబాబు, మిగతా .. 2లో..

కాంగ్రెస్ పార్టీని

## మహిళలు క్షమించరు

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాంగ్రెస్ పార్టీని, వారి మిత్ర పక్షాలను మహిళలు క్షమించరని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. బిల్లును అడ్డుకొని మహిళలకు తీరని అన్యాయం చేశారని తెలిపారు. దిల్లీలో కేంద్ర మంత్రులు, కూటమి నేతలు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2029లోగా మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేసేందుకు కేంద్రం ప్రయత్నించిందని అన్నారు. సమాజంలో తమ సత్తా చాటాలని మహిళలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. " తమ హక్కుల కోసం మహిళలు దశాబ్దాలుగా మిగతా .. 2లో..

సింహాచలం అప్పన్న స్వామిని

## దర్శించుకున్న హోంమంత్రి అనిత



**సింహాచలం, విశ్వం వాయిస్ న్యూస్ :** సింహాద్రి అప్పన్న స్వామి వారిని హోం మంత్రి అనిత దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. సోమవారం జరిగే అప్పన్న స్వామివారి చందనోత్సవం నేపథ్యంలో సింహగిరిపై ఏర్పాట్లను హోంమంత్రి పరిశీలించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలంటూ మిగతా .. 2లో..

## 'చెన్నై సూపర్-6'..

### నగరం కోసం డీఎంకే ప్రత్యేక మ్యానిఫెస్టో



**చెన్నై, విశ్వం వాయిస్ న్యూస్ :** అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఓటర్లపై హామీల వర్షం కురిపించిన అధికార డీఎంకే పార్టీ.. తాజాగా చెన్నై వాసుల మనసులూ గెలుచుకునేందుకు ప్రత్యేక మ్యానిఫెస్టోను ప్రకటించింది. 'చెన్నై సూపర్-6' పేరిట నగర ఓటర్లను ఆకట్టుకునేలా పలు హామీలు తీసుకొచ్చింది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పార్టీ ప్రధాన కార్యాలయంలో దీన్ని ఆదివారం ఆవిష్కరించారు. నగరవాసుల డిమాండ్లను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రత్యేక మ్యానిఫెస్టో తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. చెన్నై సూపర్-6లో ఆరు అంశాలను డీఎంకే ప్రస్తావించింది. నగరంలో సౌకర్యాలు మెరుగు పరచడం, వెయ్యి మినీ బస్సులు, ఏఐ సాయంతో ట్రాఫిక్ రద్దీని, ప్రయాణ సమయం తగ్గించడం వంటివి ఇందులో ఉన్నాయి. నీటి కాలువలు, కీలక రహదారి ప్రాజెక్టులు మిగతా .. 2లో..

సోలార్ ప్యానెళ్లతో నెలకు

## 300 యూనిట్ల విద్యుత్

### మంత్రి జనార్ధన్‌రెడ్డి



**బనగానపల్లె, విశ్వం వాయిస్ న్యూస్ :** నంద్యాల జిల్లా బనగానపల్లె పంచమపేటలో మంత్రి జనార్ధన్‌రెడ్డి పర్యటించారు. పీఎం సూర్యఘర్ ఉత్సవ్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ విద్యుత్ ప్యానెళ్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పీఎం సూర్యఘర్ పథకం మిగతా .. 2లో..

అసెంబ్లీ ఎన్నికలు..

## 11,000 సోషల్ మీడియా పోస్టులపై 'ఈసీ' చర్యలు





**విశ్వం వాయిస్ న్యూస్ :** ఆయా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సామాజిక మాధ్యమాల వేదికగా తప్పుదోవ పట్టించే పోస్టులు, చట్టవిరుద్ధమైన కంటెంట్‌పై ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇప్పటివరకు 11 వేల సోషల్ మీడియా పోస్టులు, ఇతర కంటెంట్‌పై చర్యలు తీసుకున్నట్లు ఈసీ వెల్లడించింది. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కేరళ, అస్సాం, పుదుచ్చేరిల్లో ఇప్పటికే పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఈ నెల 23న తమిళనాడులో, ఈ నెల 23, 29న రెండు దశల్లో పశ్చిమ బెంగాల్‌లో ఓటింగ్ నిర్వహించనున్నారు. ప్రజలను మిగతా .. 2లో..

ప్రయాణికుల భద్రత


## ప్రభుత్వ బాధ్యత

సుప్రీంకోర్టు



**విశ్వం వాయిస్ న్యూస్ :** దేశంలో పెరిగిపోతున్న రహదారి ప్రమాదాల నియంత్రణకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలు వెలువరించింది. రాజస్థాన్‌లోని ఫలోడీ, తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో జరిగిన ప్రమాదాలను సుమోటోగా తీసుకున్న న్యాయస్థానం విచారణ జరిపింది. రహదారులపై అక్రమ పార్కింగ్‌లు, బ్లాక్ స్పాట్‌ల వద్ద మిగతా .. 2లో..

## ఇరాన్‌కే రోజుకు రూ.4,600 కోట్ల నష్టం : ట్రంప్



**వాషింగ్టన్, విశ్వం వాయిస్ న్యూస్ :** హర్మూజ్ జలసంధిలో పలు నౌకలపై ఇరాన్ దాడులు చేసిందని.. ఇది కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోపించారు. హర్మూజ్ మూసివేతతో ఇరాన్ రోజుకు సుమారు రూ.4,600 కోట్లు (500 మిలియన్ డాలర్లు) నష్టపోతోందన్నారు. అమెరికాకు ఏ నష్టమూ లేదని స్పష్టం చేశారు. ఇరాన్‌తో చర్చల కోసం తమ ప్రతినిధులు సోమవారం పాకిస్థాన్‌కు చేరుకోనున్నట్లు తెలిపారు. "మేం న్యాయమైన, సహేతుకమైన ఒప్పందాన్ని ఇరాన్ ముందుంచాం. ఆ దేశం దానిని అంగీకరిస్తుందని మిగతా .. 2లో..

## మా హక్కులు హరించే అధికారం ట్రంప్‌నకు లేదు : ఇరాన్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్‌కు ఉన్న చట్టబద్ధమైన అణు హక్కులను హరించే అధికారం ట్రంప్‌నకు లేదని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ అన్నారు. అణు హక్కులను వినియోగించకూడదని ఆయన (ట్రంప్‌నుద్దేశించి) తమపై ఆంక్షలు పెడుతున్నారని.. కానీ ఏ నేరానికి ఈ శిక్ష వేయాలనుకుంటున్నారో చెప్పట్లేదన్నారు. ఒక దేశం హక్కులను హరించడానికి ఆయన ఎవరని ప్రశ్నించారు. యుద్ధాన్ని విస్తరించే ఆలోచన తమకు లేదన్నారు. అదే విధంగా దేశంలో శాంతి, స్థిరత్వం, మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# ప్రజలకు నిజాలు చెబుదాం

ఏర్పడిందన్నారు. ఈ నెల 29న పార్టీ కొత్త కార్యవర్గం బాధ్యతల స్వీకరణ ఉంటుందని తెలిపారు. తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజలకు వాస్తవాలు తెలిస్తే వాళ్లే విశ్లేషించుకుంటారని చెప్పారు.

### అన్న క్యాంటీన్‌కు రూ.76లక్షల

## విరాళం ఇచ్చిన భువనేశ్వరి

జన్మదినం సందర్భంగా ఆయన సతీమని నారా భువనేశ్వరి అన్న క్యాంటీన్‌ల ఒక రోజు ఖర్చు రూ.76 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఈ విరాళం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 269 అన్న క్యాంటీన్లలో రేపు ఉచితంగా ఆహారం అందించనునన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని అన్నక్యాంటీన్లలో మూడు పూటలా సోమవారం అన్నదానం చేస్తున్నారు. ఇందులో భాగంగా స్వయంగా ముఖ్యమంత్రి కూడా తన పుట్టిన రోజు సందర్భంగా సతీమణి భువనేశ్వరితో కలిసి పటమట హైస్కూల్ రోడ్డులోని రైతు బజార్ దగ్గర ఉన్న అన్నక్యాంటీన్‌లో అల్పాహారం తీసుకోనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని అన్న క్యాంటీన్లలో అన్నదాన కార్యక్రమం జరుగుతోంది. ఆయా ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు అన్నదాన కార్యక్రమంలో భాగస్వాములు అవ్వనున్నారు.

## కడప రిమ్స్ వద్ద హత్య...

మారెమ్మ జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన డీజే వద్ద ఆయన కుమారుడు వెంకటదస్తగిరికి అదే ప్రాంతానికి చెందిన వెంకటేష్‌కు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కొద్దిసేపటికి వెంకటదస్తగిరి ఇంటికి వెళ్లి తన తండ్రికి జరిగిన విషయం చెప్పడంతో ఆయన డీజే వద్దకు వెళ్లి గొడవలు పడొద్దని సర్దిచెప్పి ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో మరుసటి రోజు 5వ తేదీ ఆదివారం రాత్రి వెంకటదస్తగిరి మారెమ్మ ఆలయం వద్ద నుంచి వెళ్తుండగా.. వెంకటేష్ కొంత మంది యువకులతో కలిసి వెంటాడి అతనితో పాటు బంధువులపై దాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో సిద్దయ్య, మౌలాలమ్మ, కె.దస్తగిరిలు తీవ్రంగా గాయపడగా పెద్దదస్తగిరి, అతని సోదరుడు చిన్న దస్తగిరిలకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులకు వైద్యం చేయించేందుకు పెద్ద దస్తగిరి, అతని సోదరుడు చిన్న దస్తగిరిలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో వెళ్లారు. అప్పటికే కాపు కాచి ఉన్న పది మంది యువకులు వారిద్దరిని చుట్టుముట్టారు. కత్తులతో విరుచుకుపడి విచక్షణారహితంగా పొడిచారు. పెద్ద దస్తగిరి శరీరంపై పదికి పైగా కత్తిపోట్లు పడటంతో అక్కడికక్కడే మృతి చెందారు. అతని సోదరుడు చిన్నదస్తగిరికి ఛాతీ పక్కన పొడవడంతో ప్రాణాలతో బయటపడ్డారు.

### సింహాచలం అప్పన్న స్వామిని

## దర్శించుకున్న హోంమంత్రి అనిత

అధికారులకు పలు సూచనలు చేశారు. మౌలిక వసతులు, పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. భద్రతా ఏర్పాట్లలో ఏఐ టెక్నాలజీని కూడా వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

## ప్రయాణికుల భద్రత ప్రభుత్వ బాధ్యత

జరుగుతున్న ప్రమాదాలపై ఆందోళన వ్యక్తంచేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రతి ఒక్కరికీ గౌరవప్రదంగా జీవించే హక్కును ఇచ్చిందని గుర్తుచేసింది. ఈ అధికరణంలోనే ప్రతి ప్రయాణికుడికి ప్రమాదరహితంగా వెళ్లే హక్కు అంతర్గతంగా ఉందని తెలిపింది. ప్రయాణికుల భద్రతను ప్రభుత్వ బాధ్యతగా చూడాలని తెలిపింది.

### మార్గదర్శకాల్లో కొన్ని..

అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ విధానంలో భాగంగా ఎప్పటికప్పుడు రాష్ట్ర పోలీసులకు సమాచారం ఇచ్చేందుకు ఏర్పాట్లు

రైట్ ఆఫ్ వేలో (రహదారింమార్జిన్)లలో నూతన దాబా, హోటల్, వాణిజ్య నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు ఇవ్వకూడదు

జాతీయ రహదారుల వెంబడి నిర్మించిన అక్రమ నిర్మాణాలను 60 రోజుల్లోగా తొలగించేందుకు ఆయా జిల్లాల కలెక్టర్లు చర్యలు తీసుకోవాలి

జాతీయ రహదారులు వెళ్తున్న జిల్లాల్లో.. 15 రోజుల్లోగా జిల్లా రహదారుల భద్రతా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలి

రాష్ట్ర పోలీసు, రవాణాశాఖకు చెందిన అధికారులు నిరంతరం రహదారులను పర్యవేక్షించాలి. వీరు వెళ్లే వాహనాలకు ట్రాకింగ్ పరికరాలను అమర్చాలి

ప్రతి 75 కి.మీలకు వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాట్లు చేయాలి. వీటిలో విశ్రాంతి గదులు, హోటల్స్.. తదితర సౌకర్యాలను కల్పించాలి

ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్‌లను గుర్తించాలి. అక్కడ రక్షణ చర్యలు, హెచ్చరిక బోర్డులను ఉంచాలి

రెండు నెలల అనంతరం అధికార యంత్రాంగం తీసుకున్న చర్యలపై న్యాయస్థానం సమీక్ష నిర్వహించనుంది.

### 'ఉల్లి తింటా..

## బుర్ర మాత్రం తినను'..

బుర్ర మాత్రం తినను' అంటూ మోదీ నవ్వులు పూయించారు. అనంతరం అక్కడే ఉన్న మహిళలు, పిల్లలు, పార్టీ కార్యకర్తలతో ఆయన సరదాగా సంభాషించారు. 'ఝార్గ్రామ్‌లో ఝాల్‌మురీ బ్రేక్' అంటూ సంబంధిత ఫొటోలు, వీడియోలను ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారాయి.

## బాణసంచా పరిశ్రమలో పేలుడు..

ధాటికి పరిశ్రమ ధ్వంసం కాగా.. పరిసర ప్రాంతాలు కంపించినట్లు సమాచారం. వెంటనే అక్కడకు చేరుకున్న అగ్నిమాపక బృందాలు.. సహాయక చర్యలు చేపట్టాయి. ఈ ఘటనపై ముఖ్యమంత్రి స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని మంత్రులు, అధికారులను ఆదేశించారు. ఇదిలాఉంటే, విరుద్‌నగర్ జిల్లాలోనే సత్తూర్‌లో ఓ బాణసంచా ఫ్యాక్టరీలో వారం క్రితం భారీ పేలుడు సంభవించింది. ఆ ఘటనలో ఓ కార్మికుడు మరణించగా.. తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు.

### రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి

## ప్రభుత్వం కట్టుబడి ఉంది

అధికారులకు స్థానికులు సహాఖరించాలని, అధికారులు స్థానికుల ఆచారాలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. టూరిజంలో లక్షల పెట్టుబడి, ఉపాధి అవకాశం ఉందన్నారు. టూరిజం అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. టూరిజం అభివృద్ధికి అన్నీ పరిమితులను వెంటనే ఆమోదిస్తున్నట్లు ఆయన తెలిపారు. గతంలో వ్యాపారం చేసే సౌలభ్యం ఉండేదని, ఇప్పుడు వ్యాపారం వేగవంతం చేసే పరిస్థితులు ఉన్నాయని ఆయన తెలిపారు. కొన్ని దేశాలు కేవలం టూరిజం పై వచ్చే ఆదాయంతో మునుగుడా జరుగుతుందని ఆయన చెప్పారు. అదేవిధంగా టూరిజంను అభివృద్ధి పరచాలన్నారు. సముద్ర తీర ప్రాంతంలో అవాంఛనీయ సంఘటనలు జరుగుతాయని ప్రపంచమంతా తెలుసునని ఆయన చెప్పారు. అటువంటి వాటికి తావు లేకుండా స్థానికులు చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. రక్షణ విషయంలో టూరిస్టులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికులు టూరిస్టులను మోసగించకుండా, వారికి అనుకూలంగా, స్నేహపూర్వకంగా వారితో మెలిగినప్పుడు టూరిస్టులు ఎక్కువమంది వచ్చేందుకు అవకాశం ఉంటుందని, తద్వారా ఈ ప్రాంతంలో రిసార్టు ఎక్కువ అవటం, వ్యాపారం పెరగటం, ఆదాయం పెరగటం, ఉపాధి అవకాశాలు పెరగటం జరుగుతుందన్నారు. స్థానికులు రక్షణ విషయంలో నిర్వాహకులు జాతీయ నిబంధనలను జాగ్రత్తగా పాటించాలని ఆయన అన్నారు. టూరిస్టులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, స్థానికులకు ఉపాధి కల్పించాలని జిల్లా ఇన్చార్జి మంత్రి స్థానిక శాసనసభ్యులకు తెలిపారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ మాట్లాడుతూ, ఈరోజును ఒక ఇతి హాసక దినోత్సవంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా ఆయన ఏపీటీడీసీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. సముద్ర తీర ప్రాంతంలో 800 కిలోమీటర్ల వరకు అన్ని అడ్వెంచర్స్ కు అవకాశాలు కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. జిల్లాస్థాయిలో అడ్వెంచర్ కమిటీ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్, సూపరిండెంట్ ఆఫ్ పోలీస్, మత్స్యశాఖ, అటవీ శాఖ, అగ్నిమాపక శాఖ, మెరైన్ పోలీస్ వారు ఈ కమిటీలో ఉంటారని ఆయన చెప్పారు. ఈ కమిటీ ద్వారా కింది స్థాయిలో ఎటువంటి దుర్ఘటన జరగకుండా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. టూరిజంను అభివృద్ధి పరుచుటలో మత్స్యకారులకు ఎటువంటి ఆటంకం కలగకుండా, అటవీ ప్రాంతమునకు కాపాడుకుంటూ కోస్టల్ రెగ్యులర్టి జోన్ గా పాటించాలని నిర్ణయం చేసినట్లు ఆయన చెప్పారు. ఈ అభివృద్ధి ద్వారా అందరికీ మేలు జరగాలని ప్రభుత్వం కోరుకుంటుందని ఆయన చెప్పారు. బాపట్ల సూర్యలంక బీచ్ మొదలుకొని అన్ని బీచ్లను సర్వాంగ సుందరంగా గోవా రూపంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు ఆయన తెలిపారు. దీనికి అధికారులందరూ కృషి చేస్తున్నారని ఆయన చెప్పారు. స్థానికులు ఎటువంటి ఇబ్బందులు కలగజేయకుండా సహకరించాలని ఆయన అన్నారు. ఈ సందర్భంగా చీరాల శాసనసభ్యులు ఎంఎం మాలకొండయ్య మాట్లాడుతూ చీరాల తీర ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తున్న జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులకు, జిల్లా కలెక్టర్ వారికి, జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వారికి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. చీరాల పట్టణం దినదినాభివృద్ధి చెందుతుందని, అది కూడా వారి హయాంలో జరుగుతున్నందుకు చాలా ఆనందంగా ఉందని ఆయన అన్నారు. డైవ్ చీరాలలో భాగంగా ఏర్పాటు చేసిన జెట్ స్కై అనుభూతి అంతా ఇంత కాదని, అదేవిధంగా విహంగ వీక్షణం ద్వారా సముద్రంపై ప్రయాణం ఎంతో ఆనందంగా ఉంటుందని, వారి ప్రయాణం కు యూట్యూబ్లో మూడు లక్షల వీవర్స్ వచ్చినట్లు దానికి ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. ఈ ప్రాంతంకు ఇతర ప్రాంతాల నుండి టూరిస్టులు అధికంగా వస్తున్నారని, ఇక్కడ రిసార్ట్ సౌకర్యం బాగా ఉందని, ఇక్కడ చీరాల మెడికల్ కాలేజ్ పూర్తి అయితే ఇంకా బాగుంటుందని ఆయన అన్నారు. అధికారులు ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని, చీరాల అభివృద్ధికి పెట్టుబడులు వస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా జెట్ స్కై కి అధినేత రాజ్ కుమార్ మరియు విహంగ అడ్వెంచర్స్ అధినేత సూర్య లకు ఎం. ఓ. యు పత్రాలను జిల్లా ఇన్చార్జి మంత్రి కొలుసు పార్థసారథి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సంక్షేమమే ధ్యేయంగా

## కూటమి ప్రభుత్వం పని చేస్తోంది

మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కృతజ్ఞతలు తెలిపారు. "తెదేపా పార్టీ కోసం కృషి చేస్తోన్న నాకు సమున్నత గౌరవం ఇచ్చారు. వైకాపా హయాంలో రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. పోలవరం, అమరావతి నిర్మాణాల్లో కేంద్రం ఎంతో సహకరిస్తోంది. వైకాపా మాజీ ఎంపీ భరత్ చేస్తోన్న తప్పుడు ప్రచారాలు ఆపాలి. గతంలో తెదేపా హయాంలో ప్రారంభించిన అభివృద్ధి పనులను భరత్ ఆపేశారు. రాజమహేంద్రవరంలో ప్రస్తుతం రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. జగన్ తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశం ఏ మాత్రం లేదు" అని అన్నారు.

### కాంగ్రెస్ పార్టీని

## మహిళలు క్షమించరు

పోరాటం చేస్తున్నారు. 2023లోనే నారీశక్తి వందన్ అధినియం తెచ్చాం. అందరూ మద్దతిచ్చారు. మహిళా బిల్లుకు సాంకేతికంగా కొన్ని సవరణలు అవసరమై తీసుకువచ్చాం. రెండ్రోజులపాటు అన్ని పార్టీల నేతలు మాట్లాడారు. విపక్ష నేతలకు మహిళలంటే ఎంత వ్యతిరేకత ఉందో అర్థమైంది. మహిళా బిల్లును వీగిపోయేలా చేసేందుకు రాజకీయ కుట్రలు పన్నారు. తాజాగా తీసుకొచ్చిన బిల్లు ప్రకారం.. ప్రతిచోటా 50 శాతం సీట్లు పెరుగుతాయి. మహిళా బిల్లును అడ్డుకునేందుకు అనేక మెలికలు పెట్టారు. బిల్లుకు సవరణ చేసి తెస్తామని అమిత్ షా చెప్పినా వినలేదు. మహిళలకు రిజర్వేషన్ ఇవ్వడం కాంగ్రెస్, దాని మిత్రపక్షాలకు ఇష్టం లేదు. దేశంలోని మహిళలకు సముచిత స్థానం ఇవ్వాలనే బిల్లు తెచ్చాం. డీలిమిటేషన్‌ను ఎందుకు అడ్డుకుంటున్నారో విపక్షాలు స్పష్టంగా చెప్పాలి. గతంలో నాలుగుసార్లు డీలిమిటేషన్ చేశారు. ఇవాళ కొత్తేం కాదు. 1971 జనాభాలెక్కల ప్రకారం 550 సభ్యులు ఉండాలని అప్పటి నేతలు చెప్పారు. ఇప్పుడు దేశంలో 140 కోట్లమంది ప్రజలు ఉన్నారు. సీట్లు పెంచాలా? వద్దా? ఇవాళ కొన్ని లోక్‌సభ స్థానాల్లో 40 లక్షల మంది ప్రజలు ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన బిల్లులో కూడా మీరు డీలిమిటేషన్ పెట్టారు కదా. గతంలో మీరు చేసిన ప్రకారమే డీలిమిటేషన్ చేస్తున్నాం. మేం ఏమీ మార్చలేదు. డీలిమిటేషన్ కమిషన్ చెప్పినట్లే సీట్లు పెరుగుతాయి. ఎందుకు భయపడుతున్నారు? ప్రజలను మభ్యపెట్టేందుకు ఏదేదో చెబుతున్నారు. సాంకేతిక విషయాలు ప్రజలు పట్టించుకోరని అనుకుంటున్నారు. మహిళలకు న్యాయం చేసేంత వరకు ఎన్డీఏ ప్రభుత్వం ప్రయత్నాలు ఆపదు " అని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు.

## 'చెన్నై సూపర్-6'..

పూర్తి చేయడం, రహదారుల వెంబడి చెట్ల పెంపకం, ప్రపంచ స్థాయి సదుపాయాల కల్పన వంటి హామీలు ఇచ్చింది. మెట్రో రైలు విస్తరణ, వీధి కుక్కల నియంత్రణ, వెటర్నరీ డాక్టర్ల సంఖ్యను మూడింతలు చేయడం, క్షేత్రస్థాయి సిబ్బంది పెంచడం వంటివీ జోడించింది. యువతను ఆకట్టుకోవడానికి రూ.10వేల కోట్ల టెక్నాలజీ హబ్ ఏర్పాటు వంటి హామీలు గుప్పించింది.

### ఎందుకు కీలకం?

తమిళనాడులో ఎన్నికలు ఒక ఎత్తైతే రాజధాని చెన్నైలో పోరు మరో ఎత్తు. ఇక్కడ పట్టు సాధిస్తే ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సులువని రాజకీయ విశ్లేషకులు చెప్పే మాట. అందుకే అన్ని పార్టీలు హోరాహోరీగా తలపడుతున్నాయి. ఈ క్రమంలోనే డీఎంకే ప్రత్యేక మ్యానిఫెస్టో తీసుకురావడం గమనార్హం. గ్రేటర్ చెన్నై పరిధిలోని 22 నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో డీఎంకే ఏకంగా 20 స్థానాల్లో పోటీ చేస్తోంది. ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మరో ముగ్గురు ఇందులో ఉన్నారు. ఎన్డీయేలో అన్నాడీఎంకే 18 చోట్ల బరిలోకి దిగగా.. టీవీకే అధినేత విజయ్ ఇక్కడ పోటీ చేస్తుండటంతో పాటు పలుచోట్ల అభ్యర్థులను బరిలో ఉంచింది. ఏప్రిల్ 23న తమిళనాట ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

### సోలార్ ప్యానెళ్లతో నెలకు

## 300 యూనిట్ల విద్యుత్

లబ్ధిదారులతో మంత్రి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం, ఇతరులకు 40శాతం రాయితీతో సోలార్ ప్యానెళ్లను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఈ పథకం ద్వారా నెలకు 300 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉత్పత్తి చేయొచ్చని, మధ్యతరగతి కుటుంబాలకు విద్యుత్ బిల్లుల భారం తగ్గించవచ్చని అన్నారు. అదనంగా ఉత్పత్తి చేసే విద్యుత్‌ను ప్రభుత్వానికి అమ్మవచ్చన్నారు. ఈ పథకంతో భవిష్యత్‌లో విద్యుత్ కొరతకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉందన్నారు.

### అసెంబ్లీ ఎన్నికలు..

## 11,000 సోషల్ మీడియా పోస్టులపై 'ఈసీ' చర్యలు

తప్పుదోవ పట్టించే లేదా ఏఐ ద్వారా సృష్టించిన, మార్పులు చేసిన చట్టవిరుద్ధమైన కంటెంట్ విషయంలో ఫిర్యాదు వచ్చిన మూడు గంటల్లోగా చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు ఎన్నికల యంత్రాంగం ఇప్పటికే ఆదేశించింది. అదేవిధంగా ప్రచారం కోసం ఉపయోగించే కృత్రిమ మేధ కంటెంట్‌పై 'ఏఐ జనరేటెడ్' అని లేబుల్ ఉండేలా పార్టీలు, అభ్యర్థులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. మార్చి 15న ఎన్నికల ప్రకటన వెలువడినప్పటి నుంచి ఇప్పటివరకు 11 వేలకుపైగా ఈ తరహా సోషల్ మీడియా పోస్టులు, యూఆర్‌ఎల్‌లను గుర్తించి చర్యలు తీసుకున్నట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. కంటెంట్ తొలగింపు, ఎఫ్ఐఆర్ నమోదు వంటివి చేపట్టినట్లు తెలిపింది. అదేవిధంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి మార్చి 15 నుంచి ఈ నెల 19 వరకు సీ-విజిల్ యాప్ ద్వారా 3,23,099 ఫిర్యాదులు వచ్చాయని వెల్లడించింది. వీటిలో 3,10,393 ఫిర్యాదులను అవి అందిన 100 నిమిషాల్లోపే పరిష్కరించినట్లు పేర్కొంది.


## ఇరాన్‌కే రోజుకు రూ.4,600 కోట్ల నష్టం : ట్రంప్

ఆశిస్తున్నా. లేనిపక్షంలో ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలు, వంతెనలను నాశనం చేస్తాం. ఇక మీదట అంత మంచివాడిలా ఉండను. ఇరాన్ యంత్రాంగానికి ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమైంది" అని ట్రంప్ హెచ్చరించారు. ఇటీవల పాకిస్థాన్ వేదికగా అమెరికా- ఇరాన్‌ల మధ్య జరిగిన మొదటి విడత శాంతి చర్చలు విఫలమైన విషయం తెలిసిందే. సుదీర్ఘంగా సాగిన ఈ చర్చల్లో ఇరుదేశాల మధ్య ఎలాంటి ఒప్పందమూ కుదరలేదు. ఇరాన్ తమ షరతులు అంగీకరించలేదని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వెల్లడించారు. అయితే, అమెరికా అర్థం లేని డిమాండ్లు చేసిందని ఇరాన్ ఆరోపించింది.

## మా హక్కులు హరించే అధికారం ట్రంప్‌నకు లేదు : ఇరాన్

భద్రతను పరిరక్షించే బాధ్యత తమపై ఉందన్నారు. అందువల్లే గౌరవప్రదంగా యుద్ధాన్ని ముగించాలని తాము కోరుకుంటున్నామని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని అగ్రరాజ్యానికి సూచించారు. అణు ఇంధనాన్ని పరిరక్షించుకోవడం తమ హక్కు అని, దానిపై ఆంక్షలు పెట్టే ఏ దేశమూ ఇరాన్‌పై విజయం సాధించలేదని పెజెష్కియాన్ అన్నారు. యురేనియం శుద్ధిపై అమెరికా పరిమితులు విధించడాన్ని తోసిపుచ్చిన ఆయన.. తమకు ఎవరి అనుమతి అవసరం లేదని వ్యాఖ్యానించారు. టెహ్రాన్ ఎప్పుడూ సొంతంగా ఘర్షణలు ప్రారంభించలేదని.. అలాగే తమ జోలికి ఎవరు వచ్చినా ఊరుకోబోమని అన్నారు. కారణం లేకుండా ఇతర దేశాలపై దాడులు చేసే ఉద్దేశం తమకు లేదని పేర్కొన్నారు. ఇక, అమెరికాతో రెండో దశ చర్చలు ఎప్పుడు జరుగుతాయనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ వెల్లడించింది.

## అమెరికాలో కాల్పులు.. 8 మంది పిల్లలు మృతి



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికాలోని లూసియానాలో ఓ రద్దీ ప్రదేశంలో సాయుధుడు జరిపిన కాల్పుల్లో ఎనిమిది మంది పిల్లలు మృతి చెందారు. మృతుల వయసు ఒకటి నుంచి 14 ఏళ్ల మధ్య ఉంటుందని ష్రీవ్‌పోర్ట్ అధికారులు వెల్లడించారు. దాడుల అనంతరం నిందితుడు ఓ కారును తస్కరించి పారిపోయే ప్రయత్నం చేశాడు. వెంబడించిన పోలీసులు అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో కాల్పులు జరపగా నిందితుడు చనిపోయినట్లు పోలీసులు పేర్కొన్నారు. కాల్పులకు గురైన వారిలో కొందరు నిందితుడికి బంధువులని పోలీసులు భావిస్తున్నారు.

# ఎడిటర్ వాయిస్

## జగన్ వర్సెస్ షర్మిల.. ఒకేసారి పాదయాత్రకు రెడీ!

ఏపీలో విచిత్ర రాజకీయం సాగుతోంది. ఒకే కుటుంబం అందులోనూ ఎంతో ప్రఖ్యాతి గడించిన వైఎస్సార్ ఫ్యామిలీలో అన్నా చెల్లెలు ఇద్దరూ విడివిడిగా రాజకీయాలు చేస్తున్నారు. ఏ కుటుంబంలో అయినా రెండు పార్టీలు వేరు రాజకీయాలు చేయడం మామూలు విషయమే. కానీ ఇక్కడ అలా కాదు షర్మిల జగన్ మీదనే తన రాజకీయ దాడి చేస్తున్నారు. వైసీపీని పూర్తిగా తగ్గించాలని ఆమె రాజకీయ వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు. దానికి కారణం ఉంది. వైసీపీ ఓటు బ్యాంక్ అంతా కాంగ్రెస్ నుంచి వచ్చినదే. దాంతో పాటు వైఎస్సార్ చరిష్మా కూడా వైసీపీకి మరో అడ్వాంటేజ్. దాంతో వైఎస్సార్ వారసత్వం తనది అంటూ షర్మిల జగన్ ని రాజకీయంగా సవాల్ చేస్తున్నారు. అందుకే ఆమె ఏరి కోరి ఏపీ రాజకీయాల్లో అడుగు పెట్టారు. పీసీసీ చీఫ్ గా ఆమె ఉంటూ జగన్ రాజకీయాన్ని గట్టిగా నిలువరించే ప్రయత్నం చేస్తున్నారు.

వచ్చే ఏడాది పాదయాత్ర : ఇదిలా ఉంటే వైసీపీ అధినేత జగన్ వచ్చే ఏడాది పాదయాత్రకు సిద్ధం అవుతున్నారు. 2029 లో జరిగే ఎన్నికలు వైసీపీకి చావో రేవో లాంటివి అన్నది తెలిసిందే. ఈసారి కనుక గెలిస్తే వైసీపీ మరింత బలంతో దీర్ఘకాలం కొనసాగుతుంది. పొరపాటున ఓడితే మాత్రం ఏమి జరుగుతుంది అన్నది ఎవరికీ తెలియదు. దాంతో వైసీపీ అధినాయకత్వం ఈ ఎన్నికలను చాలా సీరియస్ గానే తీసుకుంటోంది. జగన్ విషయమే తీసుకుంటే పాదయాత్రతో ఈసారి ఏపీలోని అణువణువూ చుట్టేయాలని చూస్తున్నారు. దానికి తగిన విధంగా ప్రణాళికలు రచిస్తున్నారు. గ్రామ స్థాయి నుంచి ప్రతీ చోటా ప్రతీ ఏరియాను టచ్ చేయాలని జగన్ చూస్తున్నారు. అంతే కాదు ఏకంగా అయిదు వేల కిలోమీటర్ల పైగా సుదీర్ఘమైన పాదయాత్రకు జగన్ సిద్ధపడుతున్నారని సమాచారంగా ఉంది.

తండ్రి జయంతి వేళ : దానికి వైసీపీ ఒక మంచి ముహూర్తాన్ని కూడా సిద్ధం చేసుకుంది. 2027లో వైఎస్సార్ జయంతి అయిన జూలై 8 నుంచి పాదయాత్రకు జగన్ సిద్ధపడతారని అంటున్నారు. ఆ పాదయాత్ర 2029 ఎన్నికల ముందు వరకూ కొనసాగుతుందని అంటున్నారు. దానికి సంబంధించిన రూట్ మ్యాప్ ని రూపొందించే పనిలో వైసీపీ ప్రస్తుతం ఉంది అని అంటున్నారు. అదే సమయంలో వైసీపీకి ఎన్నికల వ్యూహకర్తగా కొత్త వారిని తీసుకోవాలని చూస్తున్నారు అని అంటున్నారు. అదే విధంగా వైసీపీలో సమిష్టి నాయకత్వాన్ని అభివృద్ధి చేయడం గ్రామ స్థాయి వరకూ పార్టీ కమిటీలను పూర్తి స్థాయిలో నియామకం చేయడం ద్వారా జగన్ పాదయాత్రలో ఉన్నా కూడా పూర్తి ఫోకస్డ్ గా అలెర్ట్ గా ఉండేలా చర్యలు తీసుకుంటోంది. మొత్తం మీద జగన్ పాదయాత్ర అన్నది ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా ఉండబోతోంది. ఏపీ రాజకీయాల్లో ప్రకంపనలు రేగేలా ఈ పాదయాత్ర ఉంటుందని వైసీపీ నేతలు అంటున్నారు.

షర్మిల సైతం : అయితే అదే సమయంలో మరో వార్త కూడా ఏపీ రాజకీయాల్లో ప్రచారంలో ఉంది. పీసీసీ చీఫ్ షర్మిల కూడా పాదయాత్రకు సిద్ధపడుతున్నారు అన్నదే ఆ వార్త. ఆమె కూడా జగన్ పాదయాత్రకు కాస్తా ముందో వెనకో తాను కూడా పాదం కదుపుతారు అని అంటున్నారు. షర్మిల విషయానికి వస్తే ఉమ్మడి ఏపీలో జగన్ జైలులో ఉన్నపుడు పెద్ద ఎత్తున పాదయాత్ర చేపట్టారు. చేవెళ్ళ టూ ఇచ్ఛాపురం పేరుతో ఆమె నాడు పాదయాత్ర వైసీపీ కోసం చేశారు. ఆ తరువాత 2022 లో తెలంగాణాలో పార్టీ పెట్టి అక్కడ కూడా షర్మిల భారీ పాదయాత్ర చేశారు. దాంతో ఇపుడు ముచ్చటగా మూడోసారి ఏపీలో పాదయాత్రకు ఆమె సిద్ధం అవుతున్నారు అని అంటున్నారు. జగన్ పాదయాత్రకు పోటీగా షర్మిల పాదయాత్ర సాగితే కనుక ఏపీ రాజకీయాలు హీటెక్కడం ఖాయమని అంటున్నారు. మరి జగన్ కూటమి మీద తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తారు. షర్మిల రాజకీయ విమర్శలు ఎలా ఉండబోతాయి అన్న దానిని చూడాల్సి ఉంది. ఏది ఏమైనా అన్నా చెల్లెలు ఒకేసారి రోడ్డు మీదకు వచ్చి పాదయాత్ర చేస్తే మాత్రం ఎవరికి ప్లస్ ఎవరికి మైనస్ అన్నది కూడా ఉంది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# పవన్ త్వరగా కోలుకోవాలి : వైఎస్ జగన్

**తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ఇటీవల సర్జరీ జరిగింది. ఈ నేపథ్యంలో పవన్ త్వరగా కోలుకోవాలంటూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఆకాంక్షించారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా పోస్టు చేశారు. ఇదిలా ఉండగా.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స జరిగింది. ఈ విషయాన్ని జనసేన పార్టీ ఎక్స్ పోస్ట్‌లో పేర్కొంది. శుక్రవారం ఉదయం సడెన్‌గా పవన్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కొద్ది నెలలుగా ఆరోగ్యపరంగా ఇబ్బందిపడుతున్న ఆయన తన వ్యక్తిగత వైద్యుల సలహాతో ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్య పరీక్షలతోపాటు ఎం.ఆర్.ఐ. కూడా నిర్వహించారు. వాటిని పరిశీలించిన



వైద్యులు శస్త్ర చికిత్స చేయవలసి ఉంటుందని నిర్ణయించి, శనివారం సాయింత్రం శస్త్రచికిత్స చేశారు. వారం నుంచి పది రోజులపాటు విశ్రాంతి తర్వాత ఆయన అధికారిక కార్యక్రమాలలో పాల్గొనవచ్చని డాక్టర్లు తెలిపారు. అయితే దీర్ఘకాలం తగిన జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుందని, పూర్తి స్వస్థత చేకూరడానికి ఎక్కువ కాలం పడుతుందని డాక్టర్లు చెప్పారు. ఇదే విషయాన్ని పవన్ రాజకీయ కార్యదర్శి హరి ప్రసాద్ తెలిపారు. 2018లో పవన్ కల్యాణ్ కంటి సమస్యతో ఇబ్బంది పడ్డారు. ఆ సమయంలో హైదరాబాద్‌లోని ఎల్వీప్రసాద్ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్న విషయం తెలిసిందే. పవన్ ఎడమ కంట్లో కురుపు ఉన్నట్లుగా గుర్తించిన వైద్యులు శస్త్రచికిత్సతో తొలగించారు. రంగస్థలం మూవీ సక్సెస్ మీట్‌లో ఈ విషయాన్ని పవన్ వెల్లడించారు.

# 'ఏపీకి రాజధాని లేకపోవడానికి కారణం చంద్రబాబే' : అంబటి

**గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకపోవడానికి ప్రధాన కారణం చంద్రబాబేనని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. చంద్రబాబు అవినీతే దీనికి కారణమని చెప్పారు. అవినీతి కోసమే అమరావతిని సృష్టిస్తున్నారని మండిపడ్డారు. గుంటూరులో అంబటి రాంబాబు మీడియా సమావేశంలో మాట్లాడారు. 'రాజధాని పేరుతో చంద్రబాబు తన వారికి దోచిపెడుతున్నారు. రాజధాని నిర్మాణానికి రూ.2 లక్షల ఖర్చు పెడతామంటున్నారు. అమరావతి పేరుతో భయంకరమైన దోపిడీకి చంద్రబాబు తెరదీశారు. ఇప్పటివరకు రాజధాని కోసం రూ.45 వేల కోట్ల అప్పు తెచ్చారు. అప్పులు తెచ్చి రాజధాని నిర్మించాల్సిన అవసరం ఉందా? మావిగన్ ప్రతిపాదనతో ప్రజల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. తక్కువ ఖర్చుతో రాజధాని నిర్మించవచ్చని జగన్ మావిగన్ ప్రతిపాదన తెచ్చారు. మావిగన్ ప్రతిపాదనతో టీడీపీలో భయం పట్టుకుంది. అందుకే చంద్రబాబు నాయుడు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. మావిగన్‌పై కొందరు కావాలనే ట్రోల్స్ చేస్తున్నారు' అని అంబటి రాంబాబు చెప్పారు.

**అమరావతి అసాధ్యమనే మావిగన్ ప్రతిపాదన**

హైదరాబాద్, బెంగళూరు వంటి మహా నగరాల్లో ఏదైనా ఓ నిర్మాణం చేపట్టాలంటే గరిష్టంగా చదరపు అడుగుకు రూ.4500 ఖర్చవుతుందని అంబటి రాంబాబు అన్నారు. 'తాడేపల్లి, గుంటూరు వంటి చోట్ల కట్టినా చదరపు అడుగుకు రూ.2500 అవుతుంది. ఫైవ్‌స్టార్ హోటల్ లెక్కన కట్టినా చదరపు అడుగుకు విజయవాడ, గుంటూరుల్లోనూ రూ.3500 కంటే ఎక్కువ కాదు. కానీ అమరావతిలో మాత్రం చదరపు అడుగుకు రూ.14 వేల నుంచి రూ.16 వేలు ఖర్చు పెట్టడం దోపిడీ కాదా? అనేక సందర్భాల్లో ప్రభుత్వం దీనిపై సమాధానం చెప్పలేకపోతోంది. మేం దోచుకుంటాం, మీరు చూస్తూ ఉండండి అంటున్నారు. అమరావతిలో



రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ వంటి కనీస మౌలిక సదుపాయాల కోసమే రూ.2 లక్షల కోట్లు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. ఇంత భయంకరమైన దోపిడీకి చంద్రబాబు అమరావతి పేరుతో తెర దీశారు. ఇప్పటికే రూ.75 వేల కోట్లు ప్రాథమిక వసతుల కోసం ఖర్చు పెట్టాలని అనుకున్నారు. ఇందులో రూ.45 వేల కోట్లు బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చారు. ఆర్థికంగా దెబ్బ తిన్న రాష్ట్రానికి లక్షల కోట్లు అప్పు తెచ్చి అమరావతి నిర్మించాల్సిన అవసరం ఉందా అని అడుగుతున్నాం. అందుకే జగన్మోహన్ రెడ్డి మావిగన్ అనే ప్రతిపాదన తెచ్చారు. దీంతో చంద్రబాబు గుండెల్లో రాయిపడినట్లయింది. దీనిపై జనం ఆలోచించడం మొదలుపెట్టారు. అందుకే మావిగన్ మీద బూతులతో ట్రోలింగ్ చేయడం మొదలుపెట్టారు. ఇవాళ అంతా రివర్స్ అయింది. వాళ్ల వాదన తప్పని తేలిపోయింది. మావిగన్ పై రాష్ట్రమంతా చర్చ జరుగుతోంది' అని చెప్పారు.

# ప్రతి నీటి బొట్టును ఒడిసిపడదాం

### జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ



**ఫిరంగిపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలని జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ అన్నారు. మండలంలోని హౌస్ గణేష్‌పాడులో జలధార–జలహారతి, స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. జలధార, జలహారతిలో భాగంగా గ్రామంలోని చెరువు వద్ద పనులకు కొబ్బరికాయ కొట్టి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం వందరోజులపాటు కొనసాగుతుందని తెలిపారు. ప్రతి చెరువు నీటితో నిండి ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. జలవనరులు మనిషి మనుగడకు దోహదం చేస్తాయని చెప్పారు. వాటిని భావితరాలకు అందించాల్సిన వనరు అని తెలిపారు.

**పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి**

స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం వాటర్, పాజిటివ్ ఆంధ్రా థీమ్‌తో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సాయికాంత్ వర్మ అన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజినీర్ వెంకటరత్నం, నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ ఇంజినీర్ వి.శంకర్, జిల్లా పంచాయతీ అధికారి బీవీ నాగసాయి కుమార్, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజినీర్ కె.కల్యాణ చక్రవర్తి, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# నగ్న వీడియో కాల్స్ దందా..

### సాయి, ముగ్గురు మహిళలు..

**గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** గుంటూరులోని తెనాలి చెంచుపేట కేంద్రంగా న్యూడ్ వీడియో కాల్స్ దందా వెలుగులోకి వచ్చింది. నిర్వాహకులైన ముగ్గురు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్ట్రిప్ టాక్ పేరుతో ఆన్‌లైన్ పోర్టల్ ఈ దందా నిర్వహిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారం నిర్వహిస్తున్న సాయిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పోర్టల్ విషయం వెలుగులోకి రావడంతో పోలీసులు అలర్ట్ అయ్యారు. వివరాల మేరకు.. తెనాలి పట్టణ పరిధి పాండురంగపేట, చెంచుపేటకు చెందిన ముగ్గురు మహిళలు చెంచుపేటలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని అక్కడకు మహిళలను తీసుకువచ్చి ఈ న్యూడ్ కాల్స్ చేయిస్తున్నట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఈ కాల్స్ చేయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో స్ట్రిప్‌టాక్ పేరిట ఉన్న పోర్టల్‌లో లాగిన్ అయి ఈ న్యూడ్ కాల్స్ వ్యవహారం జరుపుతున్నారు. ఇంటర్నెట్ అందుబాటులో ఉన్న ఏ దేశం నుంచైనా ఈ పోర్టల్‌లో లాగిన్ అయి న్యూడ్ కాల్స్‌కు నగదు చెల్లించి లైవ్‌లో మహిళలతో న్యూడ్ కాల్స్‌లో చాటింగ్ చేయవచ్చు. తెనాలి నిర్వాహకులు స్వీటీ - క్యూటీ పేరిట లాగిన్ అయి దాని ద్వారా ఇతర మహిళలతో ఈ దందా నిర్వహిస్తున్నారని తెలుస్తోంది. ముందు మాస్క్ వేసుకుని చాట్ చేసి నగదు చెల్లింపు పూర్తయ్యాక న్యూడ్ కాల్స్ చేస్తుంటారని పోలీసులు తెలిపారు.

**సులువుగా డబ్బు సంపాదన...**

ఓ గదిలో ఉండి దుస్తులు లేకుండా వీడియో కాల్‌లో కనిపిస్తే రూ.500 నుంచి రూ.వెయ్యి ఇస్తామంటూ మహిళలు, యువతులను నిర్వాహకుడు సాయి.. ఈ రొంపిలోకి దించుతున్నాడు. ఇలా తెనాలిలో ఈ దందా నిర్వహిస్తున్న వారి వద్ద సుమారు 80 నుంచి 100 మంది మహిళలు ఉన్నారని, వారిలో రోజుకు ఒకరిద్దరు ఈ కాల్స్‌కు వచ్చి వెళ్తుంటారని సమాచారం. నిర్వాహకులైన ముగ్గురు మహిళలు 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న వారు కావడంతో వారికి ఆన్‌లైన్ పోర్టల్, వాటి లాగిన్, ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్ వంటి సాంకేతిక పరిజ్ఞానం ఉండే అవకాశం లేదు. ఈ వ్యవహారాలన్నీ చక్కబెట్టడం, న్యూడ్‌కాల్స్‌కు ఒప్పుకున్న మహిళలను కారులో అద్దె ఇంటికి తీసుకెళ్లడం వంటివి సాయి చేస్తుంటాడని పోలీసులు భావిస్తున్నారు. దీంతో, సాయిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

# వందేళ్ళ జీవితానికి చక్కటి ఆరోగ్య సూత్రాలు!

హెల్త్ వాయిస్



ఒకప్పుడు ప్రజల జీవనశైలి ఏ విధంగా ఉండేదో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఒళ్ళువంచి పని చేయడమే కాకుండా ఆరోగ్యకరమైన ఆహారాన్ని స్వయంగా పండించుకొని మరీ తినేవారు. కానీ కాలం మారుతున్న కొద్దీ పెరుగుతున్న టెక్నాలజీ పరంగా ఈ మధ్యకాలంలో అన్ని యంత్రాల పైనే ఆధారపడ్డారు. ఒకరకంగా చెప్పాలి అంటే ఈ మధ్యకాలంలో పని చేసేవారు చాలా తక్కువే అని చెప్పాలి.. ఏ చిన్న పని చేయాలి అన్నా సరే యంత్రాలపైన ఆధారపడుతున్నారు. అటు ఆహారం విషయంలో కూడా మందులతో పండించిన ఆహారాలు తినడం వల్ల ఆరోగ్యం దెబ్బతింటుంది. దీనికి తోడు అధిక ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడంతో మరెన్నో కారణాలవల్ల గుండెపోటు, మధుమేహం తోపాటు ఇతర అనారోగ్య సమస్యలు కూడా చుట్టూ ముడుతున్నాయి. అలా వందేళ్లు జీవించాల్సిన వ్యక్తులు 50 ఏళ్లు కూడా ఆరోగ్యంగా జీవించలేకపోతూ ఉండడం ఆశ్చర్యకరమనే చెప్పాలి. నిజానికి ఒకప్పుడు మన ఇండియాలోనే వందేళ్లకు పైగా జీవించిన వ్యక్తులు ఉన్నారు. కానీ ఇప్పుడు చూస్తే మాత్రం సగటు వ్యక్తి జీవితకాలం 50 కూడా ఉండడం లేదు అనేది వాస్తవం. అయితే ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగిస్తూ వందేళ్ల జీవితం పొందాలి అంటే కచ్చితంగా కొన్ని ఆరోగ్య సూత్రాలు పాటించాలని చెబుతున్నారు జపాన్ ప్రజలు. ఇక్కడ మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే..

ప్రపంచవ్యాప్తంగా వందేళ్లకు పైగా జీవిస్తున్న వారు ఎక్కడ ఉన్నారని ఆరా తీయగా.. జపాన్లోని ఒకినావా ప్రదేశం మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఇటలీలోని సార్డీనియా, గ్రీస్‌లోని ఇకారియా, కోస్తారికాలోని నికోయా ప్రాంతాలు ఉన్నాయి.. వీటన్నింటినీ కూడా బ్లూ జోన్స్‌గా పిలుస్తున్నారు. అంటే దీర్ఘకాలిక జబ్బులు ఏమీ లేకుండా వందేళ్లపాటు జీవిస్తున్న వారు ఉండే ప్రాంతాలని బ్లూ జోన్స్ అని పిలుస్తారు. ఇక్కడ ఉండేవారి దృష్టి ఆరోగ్యంపై కాకుండా జీవన నాణ్యత పై ఉంటుంది. వీరెవరు కూడా క్యాలరీలు లెక్కించుకొని తినరు. పదేపదే ఆహారపు అలవాట్లు, పద్ధతులను కూడా మార్చుకోరు. ఈరోజు ఏం తిందాం అని ఆలోచించకుండా ఆయా సమయాలలో స్థానికంగా దొరికే పదార్థాలను తీసుకుంటూ కడుపు నిండేలోపు తిండి ఆపేస్తారు. నూరేళ్లపాటు జీవించడానికి ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు జీవనశైలిపై దృష్టి పెడతారు. కాబట్టి ఈ ఆరోగ్యం వారి సొంతం అయ్యింది పని నిపుణులు సైతం తెలియజేస్తున్నారు. మనిషి ఆరోగ్యంగా జీవించాలి అంటే మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి. ఆహ్లాదకరమైన జీవితాన్ని గడపడానికి ప్రయత్నం చేయాలి. ఆహారంపై దృష్టి పెట్టకుండా జీవన శైలిపై దృష్టి పెడితే ఇది సాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు.

# స్కూలు పిల్లల లంచ్ బాక్స్‌లో ఏమిటీ దారుణం...

అవును... తాజాగా వైరల్ అవుతున్న ఓ వీడియోలో స్కూలు పిల్లల లంచ్ బాక్సులో... ఇనిస్టంట్ నూడుల్స్ వంటి వంటకాలతో పాటు బంగాళాదుంప చిప్స్, చీజ్ బాల్స్ వంటి ప్యాక్ చేసిన స్నాక్స్ ను కలిగి ఉన్నారు. ఇటీవల కాలంలో పిల్లల్లో ఫిట్ నెస్ పోవడానికి, మానసిక ఎదుగుదలలో పెను మార్పులు సంభవించడానికి, వయసు పెరిగే కొద్దీ వారి శారీరక ఆరోగ్యాన్ని ప్రభావితం చేయడానికి, చిన్న వయసులోనే బీపీ, షుగర్ వంటి వ్యాధుల బారిన పడటానికి, ఊబకాయానికి గురవ్వడానికి.. శారీరక శ్రమ లేకపోవడం ఎంత కారణమో.. అంతకంటే ఎక్కువగా ఆహారపు అలవాట్లు అంతకంటే ఎక్కువ కారణం అనే చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో ఓ వీడియో నెట్టింట వైరల్ గా మారింది. అవును... తాజాగా వైరల్ అవుతున్న ఓ వీడియోలో స్కూలు పిల్లల లంచ్ బాక్సులో... ఇనిస్టంట్ నూడుల్స్ వంటి వంటకాలతో పాటు బంగాళాదుంప చిప్స్, చీజ్ బాల్స్ వంటి ప్యాక్ చేసిన స్నాక్స్ ను కలిగి ఉన్నారు. వారిలో ఇద్దరు విద్యార్థులు మాత్రమే బ్రెడ్ - ఆమ్లెట్, రోటీ - సబ్జీని కలిగి ఉన్నారు. ఈ నేపథ్యంలో దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఈ తరహా ఆహారాన్ని లంచ్ బాక్స్ లో పెట్టిపంపడం వెనుక పిల్లల ఒత్తిడా, తల్లితండ్రుల సమయాభావమా అనే చర్చ మొదలైంది! సాధారణంగా... ఇనిస్టంట్ నూడుల్స్, ప్యాక్ చేసిన స్నాక్స్, ఫ్లేవర్డ్ బ్రెడ్లు, రెడీ-టు-ఈట్ ఫుడ్స్ వంటి వాటిని పిల్లలు విస్తృతంగా ఇష్టపడతారనే అనుకోవచ్చు. పైగా.. ఉదయం పూట బాక్స్ లు సిద్ధం చేయడానికి ఇది త్వరిత పరిష్కారం కూడా కావొచ్చు.. అందుకే చాలా లంచ్ బాక్స్ లలో ఇవి శాశ్వత స్థానాన్ని సంపాదించుకుంటుంటాయని చెబుతారు. ఇలాంటి ఆహారం పిల్లల సరదా కోసమో, ఆనందం కోసమో అప్పుడప్పుడూ పెట్టొచ్చు కానీ.. డైలీ ఈ తరహా ఆహారం మంచిది కాదని అంటున్నారు! జంక్ ఫుడ్ పై క్రమం తప్పకుండా ఆధారపడటం పిల్లల ఆరోగ్యాన్ని అనేక విధాలుగా ప్రభావితం చేస్తుందని..



ఇనిస్టంట్ నూడుల్స్, ప్యాక్ చేసిన స్నాక్స్ లో సోడియం, అనారోగ్యకరమైన కొవ్వులు ఎక్కువగా ఉంటాయని.. ఇదే సమయంలో.. ఫైబర్, ప్రోటీన్, అవసరమైన సూక్ష్మపోషకాలు తక్కువగా ఉంటాయని చెబుతున్నారు. ఈ అసమతుల్యత తరచుగా ఆకలి, సరిపడా ఎనర్జీ లేకపోవడంతో పాటు పేలవమైన ఏకాగ్రతకు దోహదం చేస్తుందని చెబుతున్నారు. వీటి స్థానంలో కాస్త పక్కాగా ప్లాన్ చేసుకుని... చూడటానికి పిల్లలు ఇష్టపడే ఫుడ్ లుక్ లోనే ఉంటూ, మరింత కలర్ ఫుల్ గా ఉండే ఆహార పదార్థాలను ప్లాన్ చేసుకోవాలని పలువురు సూచిస్తున్నారు. ఇందులో భాగంగా... వెజిటబుల్ పరాఠాలు, పనీర్ లేదా వెజ్ రోల్స్, చనా చాట్, చట్నీతో ఇండ్లీ లేదా ఉతప్పం, ఉడికించిన గుడ్లు లేదా ఆంలెట్, ఫ్రూట్ చాట్ వంటి వాటిని ఎంపిక చేసుకోవచ్చని సూచిస్తున్నారు. ఇది పిల్లల మానసిక, శారీరక ఎదుగుదలకు చాలా ముఖ్యమని అంటున్నారు!



## ఒక హీరోతో పెళ్లి..
## మరొక హీరోతో ఎఫైర్..
### 52ఏళ్ల వయసులోనూ తగ్గని గ్లామర్..

యంగ్ హీరోలు, హీరోయిన్ చాలా మంది పెళ్లి పీటలెక్కారు. కొంతమంది మాత్రం ఇంకా సింగిల్ గానే ఉంటున్నారు. నాలుగు పదుల వయసు దాటినా కూడా ఇప్పటికీ సింగిల్ గానే ఉంటున్నారు కొందరు భామలు. ఈ అమ్మడు మరీ రాడ్ సింగిల్ అనే చెప్పాలి ఏకంగా 51 ఏళ్ళు దాటినా కూడా ఇప్పటికే పెళ్లి మాట ఎత్తకుండా ఉంటుంది. మొన్నటివరకు ఓ యంగ్ హీరోతో యవ్వారం నడిపింది. ఇప్పుడు అతన్ని కూడా వదిలిపెట్టింది. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? తెలుగులో మహేష్ బాబు, పవన్ కళ్యాణ్ లాంటి స్టార్ హీరోలతో ఆడిపాడింది ఆ అమ్మడు. ఇంతకూ ఆమె ఎవరో గుర్తుపట్టారా.? చాలా ఫేమస్ ఆమె.. ఆ బ్యూటీ ఎవరో కాదు బాలీవుడ్ హాట్ బ్యూటీ మలైకా అరోరా. ఈ బ్యూటీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. బాలీవుడ్ లో చాలా ఫేమస్ ఈ చిన్నది. ముఖ్యంగా స్పెషల్ సాంగ్స్ కు పెట్టింది పేరు ఈ అమ్మడు. మహేష్ బాబు హీరోగా నటించిన అతిధి సినిమాలో స్పెషల్ సాంగ్ చేసింది మలైకా.. అలాగే పవన్ కళ్యాణ్ నటించిన గబ్బర్ సింగ్ సినిమాలో నూ స్పెషల్ సాంగ్ చేసింది ఈ చిన్నది. బాలీవుడ్‌లో ప్రస్తుతం ఈ చిన్నది పలు టీవీ షోల్లో కనిపించి ఆకట్టుకుంటుంది. ఇక ఈ బ్యూటీ సల్మాన్ ఖాన్ సోదరుడిని పెళ్లి చేసుకొని ఆతర్వాత అతనికి విడాకులు ఇచ్చింది. ఆతర్వాత యంగ్ హీరో అర్జున్ కపూర్‌తో ప్రేమాయణం సాగించింది. తనకన్నా చాలా చిన్నవాడైన అర్జున్‌తో చాలా కాలం ప్రేమాయణం నడిపింది. ఇటీవలే ఈ ఇద్దరూ బ్రేకప్ చెప్పుకున్నారు. ప్రస్తుతం సింగిల్‌గా ఉంటుంది మలైకా.. ఇక సోషల్ మీడియాలో అందాలు ఆరబోస్తూ ఓ రేంజ్ లో ఫోటోలు షేర్ చేస్తుంది 52 ఏళ్ల ఈ హాట్ బ్యూటీ.

### ఏడేళ్ల తర్వాత..
## మళ్లీ జబర్దస్త్‌లోకి మెగా బ్రదర్ నాగబాబు
### ఆ గొడవలకు ఫుల్ స్టాప్ పడినట్టేనా?





గతంలో 'జబర్దస్త్' అంటే నాగబాబు... నాగబాబు అంటే 'జబర్దస్త్' అన్నట్టు ఉండేది. చాలా ఏళ్లుగా ఈ కామెడీ షోకు జడ్జిగా చేశారాయన. అయితే ఉన్నట్లుండి ఈ జబర్దస్త్ షోకు దూరమయ్యారు మెగా బ్రదర్. మళ్లీ ఇప్పుడు రీఎంట్రీ ఇచ్చేందుకు రెడీ అయ్యారు. మెగా బ్రదర్ నటుడిగా, నిర్మాతగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అదే సమయంలో జబర్దస్త్ జడ్జిగా కూడా బాగా ఫేమస్ అయ్యారు. నవ్వుల నవాబు నాగబాబు అంటూ జబర్దస్త్ ఆయన వేసే కామెడీ టైమింగ్ పంచులకు చాలా మంది ఫ్యాన్స్ ఉన్నారు. మాజీ మంత్రి రోజాతో కలిసి ఆయన చేసిన సందడిని బుల్లితెర అభిమానులెవరూ అంత ఈజీగా మర్చిపోలేరు. నిజం చెప్పాలంటే జబర్దస్త్ కు బాగా హైప్ రావడానికి కంటెస్టెంట్లతో పాటు నాగబాబు, రోజాలు కూడా ప్రధానకారణమని చెప్పవచ్చు. అయితే చాలా ఏళ్ల పాటు జబర్దస్త్ లో జడ్జిగా చేసిన నాగబాబు అనూహ్యంగా ఈ షోకు దూరమయ్యారు. ఆ తర్వాత రాజకీయాల్లో బిజీ కావడంతో రోజా కూడా ఈ షో నుంచి బయటకు వచ్చేశారు. ప్రస్తుతం ఈ షోకు చాలా మంది జడ్జిలుగా వస్తున్నారు.. పోతున్నారు. కృష్ణ భగవాన్, ఖుష్బూ, సంఘవి, మనో.. ఇలా చాలా మంది జడ్జిలుగా చేశారు. కాగా జబర్దస్త్ మానేయడానికి గల కారణాలను ఓ సందర్భంలో పంచుకున్నారు నాగబాబు. జబర్దస్త్ నిర్మాణ సంస్థతో విబేధాలు వచ్చాయని, వాటితో పాటు వివిధ కారణాలతోనే ఈ షోకు దూరమయ్యానని చెప్పుకొచ్చారు. కాగా జబర్దస్త్ కు దూరమయ్యాక అదిరింది వంటి కామెడీ షోలకు జడ్జిగా వ్యవహరించారు నాగబాబు. అయితే ఆ షోలు జబర్దస్త్ అంత సక్సెస్ కాలేకపోయాయి. ఆ తర్వాత రాజకీయాల్లో యాక్టివ్ గా మారిపోయారు నాగబాబు. ప్రస్తుతం ఎమ్మెల్సీగా కూడా సేవలు అందిస్తున్నారు. కాగా 2019 లో నాగబాబు జబర్దస్త్ కి దూరమయ్యారు. అయితే ఇటీవల ఓ స్పెషల్ జబర్దస్త్ ఎపిసోడ్ లో మళ్లీ కనిపించి అలరించారు మెగా బ్రదర్. ఈ విషయాన్ని ఈటీవీ అధికారికంగా ప్రకటించింది. నాగబాబు జడ్జిగా జబర్దస్త్ ఎపిసోడ్ షూటింగ్ కూడా జరిగింది. ఆ షూటింగ్ కి సంబంధించిన పలు ఫొటోలు, వీడియోలను తన సోషల్ మీడియా ఖాతాల్లో పోస్ట్ చేసి నవ్వుల నవాబు నాగబాబు కంబ్యాక్ అని విషెస్ తెలిపింది. త్వరలోనే ఆ ఎపిసోడ్ టెలికాస్ట్ కానున్నట్లు సమాచారం. కాగా నాగబాబు కేవలం ఈ ఒక్క ఎపిసోడ్ కే వచ్చారా? లేదా గతంలో లాగా ఫుల్ టైం జడ్జిగా కొనసాగనున్నారా? అనేది తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే. ఒక వేళ నాగబాబు రీ ఎంట్రీ మాత్రం కంటెస్టెంట్లకు పండగే అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే ఆయన కమెడియన్లకు చాలా మద్దతుగా నిలుస్తారు. ఈ విషయాన్ని జబర్దస్త్ కమెడియన్లే స్వయంగా వెల్లడించారు. ఇక నాగబాబు ఇటీవల పడిపోయిన జబర్దస్త్ రేటింగ్ పెరగడానికి కూడా హెల్ప్ అయ్యే అవకాశం ఉంది.

### ముల్లన్‌పూర్‌లో రికార్డుల వేట..
## కాటేరమ్మ కొడుకుల హిస్టరీకి బ్రేకులు..!



ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ యువ ఆటగాళ్లు ప్రియాంశ్ ఆర్య, కూపర్ కానల్లీ విధ్వంసం సృష్టించారు. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన పోరులో ఈ జోడీ ఆకాశమే హద్దుగా చెలరేగి, పరుగుల వరద పారించింది. ముల్లన్‌పూర్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో పాత రికార్డులను తుడిచిపెట్టడమే కాకుండా, పంజాబ్ జట్టు చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు. ముల్లన్‌పూర్ స్టేడియంలో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ కింగ్స్ జట్టుకు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. తొలి ఓవర్‌లోనే వికెట్ కోల్పోయి కష్టాల్లో ఉన్న దశలో ప్రియాంశ్ ఆర్య, కూపర్ కానల్లీ ఇన్నింగ్స్‌ను అద్భుతంగా నిర్మించారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు ఏకంగా 182 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ చరిత్రలో రెండో వికెట్‌కు ఇదే అత్యుత్తమ భాగస్వామ్యం కావడం విశేషం. గతంలో ఆడమ్ గిల్‌క్రిస్ట్, షాన్ మార్ష్ నెలకొల్పిన 206 పరుగుల రికార్డు తర్వాత ఇది రెండో స్థానంలో నిలిచింది.

**ఐడెన్ మార్క్రామ్ ఓవర్‌లో పరుగుల సునామీ..**

లక్నో బౌలర్లను లక్ష్యంగా చేసుకున్న ఈ జోడీ ముఖ్యంగా ఐడెన్ మార్క్రామ్ వేసిన ఒకే ఓవర్‌లో ఐదు భారీ సిక్సర్లు బాది 32 పరుగులు పిండుకున్నారు. లక్నో సూపర్ జెయింట్స్ జట్టు చరిత్రలో ఒక బౌలర్ ఒకే ఓవర్‌లో ఇన్ని పరుగులు సమర్పించుకోవడం ఇదే తొలిసారి. గతంలో రవి బిష్ణోయ్ 27 పరుగులు ఇచ్చి ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉండగా, ఇప్పుడు మార్క్రామ్ ఆ అప్రతిష్టను తన మూటగట్టుకున్నాడు.

**వ్యక్తిగత రికార్డుల జోరు..**

ఈ మ్యాచ్‌లో కూపర్ కానల్లీ తన టీ20 కెరీర్‌లోనే అత్యుత్తమ స్కోరును నమోదు చేశాడు. అతను 87 పరుగులతో వీరవిహారం చేసి, గతంలో పెర్త్ స్కార్చర్స్ తరపున చేసిన 77 పరుగుల రికార్డును అధిగమించాడు. దురదృష్టవశాత్తూ ఆర్య, కానల్లీ ఇద్దరూ తమ శతకాలను తృటిలో తప్పించుకున్నప్పటికీ, జట్టుకు భారీ స్కోరును అందించడంలో కీలక పాత్ర పోషించారు. పంజాబ్ టాప్-3 బ్యాటర్లు ఈ ఇన్నింగ్స్‌లో మొత్తం 16 సిక్సర్లు బాది, 2024లో కోల్‌కతాపై నెలకొల్పిన రికార్డును సమం చేశారు.

**లక్నోపై ఆధిపత్యం..**

లక్నో జట్టుపై ఏ వికెట్‌కైనా ఇదే అత్యధిక భాగస్వామ్యం కావడం గమనార్హం. గతంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ నెలకొల్పిన 167 పరుగుల రికార్డును ఆర్య-కానల్లీ జోడీ ఈరోజు తుడిచిపెట్టేసింది. ఈ ఇద్దరు యువ ఆటగాళ్ల ధాటికి రిషబ్ పంత్ నేతృత్వంలోని లక్నో జట్టు బౌలర్లు నిస్సహాయంగా ఉండిపోయారు.

## అభిషేక్ శర్మ వర్సెస్ వైభవ్ సూర్యవంశీ..
## ఇద్దరిలో డేంజరస్ ప్లేయర్ ఎవరు..?





ఐపీఎల్ 2026 సీజన్‌లో పరుగుల వర్షం కురుస్తోంది. ముఖ్యంగా యువ ఆటగాళ్లు తమ మెరుపు వేగంతో బౌలర్లకు చుక్కలు చూపిస్తున్నారు. అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ ఇద్దరూ కూడా అత్యంత వేగవంతమైన అర్ధశతకాలతో సంచలనం సృష్టిస్తున్నారు. అయితే ఈ ఇద్దరిలో బౌలర్లను వణికించే అసలైన విధ్వంసకర వీరుడు ఎవరనే చర్చ ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ప్రస్తుత సీజన్‌లో అత్యంత వేగవంతమైన అర్ధశతకాన్ని నమోదు చేసిన రికార్డు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ ఇద్దరి పేరిట ఉంది. వీరు కేవలం 15 బంతుల్లోనే 50 పరుగులు సాధించి రికార్డు సృష్టించారు. అయితే వైభవ్ సూర్యవంశీ ఈ ఘనతను ఈ ఒక్క సీజన్‌లోనే రెండుసార్లు సాధించడం విశేషం. గణంకాలను పరిశీలిస్తే వైభవ్ సూర్యవంశీ 5 మ్యాచ్‌లలో 200 పరుగులు సాధించారు. ఆయన స్ట్రైక్ రేట్ 263.15గా ఉండటం విశేషం, ఇది ఈ సీజన్‌లో ఏ బ్యాటర్‌కైనా అత్యుత్తమం. మరోవైపు అభిషేక్ శర్మ 6 ఇన్నింగ్స్‌ల్లో 188 పరుగులు చేశాడు.

**వైభవ్ ఎందుకు ప్రమాదకరం? కోచ్ వివరణ..**

వైభవ్ సూర్యవంశీ కోచ్ మనీష్ ఓజా ప్రకారం, అభిషేక్ శర్మతో పోలిస్తే వైభవ్ ఐదు కారణాల వల్ల బౌలర్లకు ఎక్కువ ప్రమాదకరంగా కనిపిస్తుంటాడని తెలిపాడు.

**అత్యంత దూకుడు:** అభిషేక్ కంటే వైభవ్ సహజంగానే ఎక్కువ దూకుడుగా బ్యాటింగ్ చేస్తాడు. మొదటి బంతి నుంచే బౌలర్‌పై ఒత్తిడి పెంచడం ఆయన శైలి.

**షాట్ల వైవిధ్యం:** వైభవ్ వద్ద అభిషేక్ కంటే ఎక్కువ రకాల షాట్లు అందుబాటులో ఉన్నాయి. మైదానం నలుమూలలా బంతిని పంపగల సామర్థ్యం ఆయనకు ఉంది.

**వేగవంతమైన పరుగులు:** స్ట్రైక్ రేట్ పరంగా చూస్తే వైభవ్ పరుగులు తీసే వేగం బౌలర్ల లయను దెబ్బతీస్తుంది.

**మానసిక ఆధిపత్యం:** బౌలర్ ఎవరు అన్నది పట్టించుకోకుండా వారిపై మానసిక ఆధిపత్యాన్ని ప్రదర్శించడంలో వైభవ్ ముందుంటాడు.

**పరిమితులు లేని బ్యాటింగ్:** అభిషేక్ శర్మ బ్యాటింగ్ శైలి ఒక పరిధికి లోబడి ఉంటుందని, కానీ వైభవ్ విషయంలో బౌలర్లు ఎక్కడ బంతి వేయాలో అర్థం కాక ఇబ్బంది పడతారని కోచ్ అభిప్రాయపడ్డారు.

**సిక్సర్ల సునామీ..**

ఈ సీజన్‌లో సిక్సర్ల పరంగా కూడా వైభవ్ దూసుకుపోతున్నారు. కేవలం 5 మ్యాచ్‌లలోనే ఆయన 18 భారీ సిక్సర్లు బాదారు. సిక్సర్ల జాబితాలో ఆయన రెండో స్థానంలో ఉన్నారు. అభిషేక్ శర్మ 17 సిక్సర్లతో ఆయన వెంటే ఉన్నారు. మొత్తానికి ఈ ఇద్దరు యువ ఆటగాళ్లు భారత క్రికెట్ భవిష్యత్తుకు ఆశాకిరణాలుగా కనిపిస్తున్నారు.




Published and Edited by Khandavelli Sunilkumar on behalf of Viswam Voice. Published from H.No. 12-9-23/6, Near Swamy School, Prakash Nagar, Narasaraopet, Guntur District, Andhra Pradesh - 522411.
Printed at Sri Sai Ganga Printers and Publications, D.No. 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District, Andhra Pradesh - 523001.Registration No: APTEL/26/A1414